

ఏ దేవాలయానికెళ్ళినా ఆ దైవం 'నేను అభయం కో'రంటూ అభయ హస్తాన్ని 'వరమిస్తున్నా'నంటూ వరద హస్తాన్ని (కుడి ఎడమ చేతుల్తో) చూపిస్తారు. పూరి జగన్నాథాలయంలో అదేమీ ఉండవు. పోనీ! పాదాలని శరణు వేడుకుందామనుకుంటే అసలా దైవానికి పాదాలూ కన్పించవు.

రోజూ చేసే అభిషేకానంతరం వచ్చే తీర్థాన్ని తీసుకుందామనుకుని ఎదురుచూస్తే ఆయనకసలు అభిషేకమే ఉండదు. పవళింపు సేవా కాలంలో దర్శించడం మరింత విశేషమని చెప్తారు కాబట్టి అలా చేద్దామనుకుని ప్రయత్నిస్తే ఆయన కనులకి రెప్పలూ మూసుకుని ఉండడం తెరవడం వంటివే ఉండవు.

ఇదేమిటి? అంతా చిత్రవిచిత్రమయంగా ఉందనుకుని మరింతగా పరిశీలిస్తే ఆయన శిలారూపంలో ఉండడు-చెక్కతో(దారుమయు)చేయబడి ఉంటాడు. రథంలో ఊరేగి తిరిగొచ్చినప్పుడు మనఃపూర్వక నమస్కారాలని అర్పించుకుందామనుకుంటే అందరు దేవతల్లాగా ఆయన ఏ రాత్రి వేళకో తిరిగి రాడే రాడు. మళ్ళీ 11వ రోజున గుడికి తిరిగొస్తాడు.

ఆయన ఆలయం 665 అడుగుల పొడుగు, 640 అడుగుల వైశాల్యంతోనూ 220 అడుగుల ఎత్తైన గోపురంతో పరమ విశాలంగా ఉంటుంది. అది సాధ్యమయ్యే పనేనా?అని చూస్తుండగానే అనిపిస్తుంది.

## యోగనిద్ర

ఆ అంతరార్థాలని క్రమంగా ఒక్కొక్కటి చెప్పినా అనుకుందాం! ఆషాఢ శుద్ధ ద్వితీయ(విదియ)నాడు రథోత్సవం. ఆషాఢం శూన్యమాసమని అందరికీ తెలుసుకదా!మరి ఈ రోజున ఉత్సవమేమిటి? ఆషాఢ మాసమనేది మానవులైన మనకి మాత్రమే- ఏ శుభ కార్యాన్నీ తలపెట్టుకోకూడని మాసం(శూన్య) తప్ప దైవకార్యాలకి అది సంపూర్ణ మాసం.

అందుకే శ్రీహరి యోగనిద్రకి ఉపక్రమించేది ఈ మాసంలోని ఏకాదశినాడే.

అభయ-వరద హస్తాలుండవేమి?టని మనమనుకుంటాం. ఆయనకి మన కళ్ళకి కన్పడే విధంగా చేతులుండక పోవచ్చు గాని, ద్రౌపదికి చీరలిచ్చినవి ఆ చేతులు కావా? ప్రహ్లాదుణ్ణి రక్షించినవీ, గజేంద్ర మొరవిని మొసలిని చక్రాయుధంతో ఖండించినవీ, శిశుపాలవధని చేసినవీ ఆ హస్తాలే కావా! వర-ద హస్తంలేదని అనుకోనక్కరలేదు. తన పూర్వజన్మలో పనిమనిషి కొడుకైన నారదుని తపస్సుకి మెచ్చి సాక్షాత్తు తన సంకీర్తన పరునిగా చేసుకోవడమే కాక, నిత్యం తన వద్దే ఉంచుకునే వరాన్ని ప్రసాదించిన ఆ చేయి వర-ద హస్తం కాకమరేమిటి?

అయ్యో! పాదాలు లేవని బాధపడడం సరికాదు. బలిచక్రవర్తి చేస్తున్న యాగానికి వామన రూపంలో వెళ్ళినవీ, అతని శిరము మీద తన పాదాన్ని మోపి అతనికి తలాతల లోకానికి అధిపత్యాన్ని ఇచ్చినవీ,

## చిత్రం విచిత్రం

# జగన్నాథ రథోత్సవం

20.6.2023



బ్రహ్మాంతటి వానికి ఉత్తమ గంగా జలంతో కడిగే అవకాశాన్ని ప్రసాదించినదీ ఈ పాదాలే కదా!

నిరంతరం అలా కళ్ళని తెరిచేఉంచి కనీసం 'నిద్ర' అనేది లేకుండా ఉంటారా? అని భావించవనవసరం లేదు. మనలా కనురెప్పల్ని మూయడం తెరవడమనేది ఉండని ఉత్తమ జాతి దేవతలు. అందుకే వాళ్ళకి 'అనిమిషులు'(రెప్పపాటు లేనివారు) అని పేరు. మన దృష్టిలో ఆయనకి నిద్రలేదని భావిస్తాం గాని ఆషాఢ శుద్ధ ఏకాదశి నుండి కార్తిక శుద్ధ ఏకాదశి వరకూ ఆయన చేసేది యోగనిద్రా కార్యక్రమమే.

## బాల్యస్మృతులు

ఈ రోజుల్లో అందరూ అంటుంటారు. 'ఎవరి సంసారాలంటూ వాళ్ళకొచ్చేశాక, ఎవరి పిల్లల చదువులూ సంధ్యలూ వాళ్ళవైపోయాక ఎలా కలుసుకోవడం, సమయాన్ని ఆనందంగా గడపడం కుదురుతుందని. ఈ జగన్నాథుడు చెప్తున్నాడు- తానూ సుభద్రా బలభద్రుడూ అనే ముగ్గురే ఓ చోట ఉంటూ కనీసం సంవత్సరానికి ఒక్కసారైనా మీరు మీరుగా వివాహాలు కాని చిన్నప్పటి రోజుల్లో ఎలా ఆనందమయంగా గడిపారో ఆ రోజుల్ని మీ భార్యపుత్రులతో కాకుండా కొన్ని రోజులపాటైనా గడపుతూంటే ఆ అనుబంధాలు శాశ్వతమౌతాయని.

ఐతే ఇది కొందరికి సాధ్యపడుతోంది.పరమ వృద్ధ వ్యవయసులో మాత్రమే.ఆ కాలంలో మాట్లాడుకునేది బాల్యస్మృతులూ ఆనందాలూ గురించి కాదు ఎవరికే వ్యాధులో నివారణోపాయాలో వైద్యులో... గురించి మాత్రమే. భగవానుడు చూపిస్తున్నాడు తాము ముగ్గురూ కలిసి ఉన్న తీరుని. అంతేకాదు ఆ ముగ్గురూ బయలుదేరి ఎవరి రథంలో వాళ్ళు ప్రయాణించడమే కాకుండా, తమ పిన్నిగారింట ఆనందంతో గడపడం కన్పిస్తుంది. పిన్ని అంటే తల్లికి చెల్లి. కొందరు చిన్నమ్మ అంటారు. అమ్మ తర్వాత అంతగా ఆదరించేది ఆమెనే కదా!

## పతితపావన ధ్వజం

ఎక్కడో ఉన్నవాళ్ళకీ, శారీరక రుగ్మతల కారణంగా రాలేని అనారోగ్యవంతులకీ వృద్ధులకీ కూడా తన దర్శన భాగ్యాన్ని ఈయదలచిన స్వామి, తన ఆలయశిఖరాన్ని 220 అడుగులు ఎత్తులో ఉండేలా చేసుకుని అక్కడ పెద్దకర్ర ధ్వజం మరో 10 అడుగుల ఎత్తులో ఉండేలా ఏర్పాటు చేసుకుని, ఎంత దూరం నుండి చూసినా అందరికీ కన్పించేలా అనుగ్రహించాడు. ఆ ధ్వజాన్ని 'పతితపావన ధ్వజ'మన్నారు.

ఆ ధ్వజాన్ని ఎప్పుడో ఓసారి దించేసి మారుస్తుంటూ ఉండడం ఉండదనలేదు. ఏ రోజుకారోజు వర్షాకాలమైనా చలికాలమైనా ఎండ మండించే సమయమే అయినా... ఆ ధ్వజాన్ని ఏదో యంత్ర సహాయంతోనో కాకుండా, ఓ అర్చకుడు స్వయంగా అంత ఎత్తుకి ఎక్కి మరీ ధ్వజాన్ని మార్చి వస్తుంటాడు.

దైవం శక్తి ధ్వజంలో కూడా ఉంటుంది. అందుకే భారతంలో జెండాపై కపిరాజు (ఆంజనేయుడు) ఉండి ఎదుటి భీష్మద్రోణాది మహామంత్రవరులైన వాళ్ళంతా ప్రయోగించిన శస్త్రాల బాధ అర్జునునికి ఏమీ లేకుండా చేశాడు.

యుద్ధం ముగిసి పాండవులకి విజయం లభించాక అర్జునుడు ఆ విజయమంతా తనదేనని కొద్దిగా అహంకారాన్ని చూపించబోతే కృష్ణుడు ఆ జెండామీదున్న ఆంజనేయుణ్ణి కిందికి రావలసిందనగానే ఆంజనేయుడు కింది దిగాడు. అంతే అంత దివ్యరథమూ అలా చూస్తూండగానే భస్మమైపోయింది. ఈ ధ్వజాన్ని చూస్తూ ఒక్కసారైనా ఈ కింద శ్లోకాన్ని చదువుకుంటూ ఉంటే జీవితాన్ని సరైన మార్గంలో నడిపించే బుద్ధి అనేదానికి సరైన మార్గం కన్పిస్తుందని చెప్తుంది ఆగమశాస్త్రం.

***భుజే సవ్యం వేణుం... శిరసి శిఖిపింఛం-కటితటే***
***దుకూలం-నేత్రాంతే సహచరకటాక్షం విదధతే,***
***సదా శ్రీమత్ బృందావన వసతిలీలా పరిచయః***
***జగన్నాథస్వామీ నయన పథగామీ భవతు మే॥***

చేతిలో ఎప్పటికప్పుడు కొత్త ధ్వనిని పుట్టించ గల వేణువూ- తలకి నెమలి పింఛం- నడుముకి విలాసంగా కట్టబడిన ఆ పట్టువస్త్రం కనుకొలకులతో అలా ఆనందాన్ని కల్గించే శ్రీగంటి చూపుతో బృందావనంలో ఎప్పుడూ విహరించే తీరు ఉన్న ఓ కృష్ణా! నాకు జీవితమార్గదర్శకుడివి కావూ?' అని ఈ శ్లోకార్థం. ఎంత గొప్ప భావం-దర్శన ఫలం!

## పునర్జన్మలేదు

ఉత్తరంలో బదరీనాథునిగా, దక్షిణంలో రామేశ్వరం రామునిగా, పశ్చిమంలో ద్వారకా కృష్ణుడుగా, తూర్పున పూరీజగన్నాథునిగా నిరంతరం సంచరిస్తూనే ఉంటాడు. ఆ ఊరేగుతున్న రథంలో జగన్నాథుణ్ణి చూస్తే మరో జన్మ ఉండదని (రథమధ్యం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే)భావించి కేవలం రథంలో చూసి సంతృప్తిపడక శరీరమనే రథంలో హృదయస్థానంలో ఆయన్నిగాని కనులు మూసుకొని దర్శిస్తూ ఉండగలిగితే పునర్జన్మ ఉండదనేది ఈ మాటవలసిందనడంలో దాగిన రహస్యం.

ఈయన ఉండేది 'పూరీ' కాదు. 'పురి'లో. పురమంటే శరీరంలో. ఆ పురంలో ఉండే జగన్నాథుడు 'పురి' జగన్నాథుడు ఆంగ్లంలో 'PURI'అని ఉన్న ఆ మాట పురీ-పూరి-పూరీ..అని ఇలా ఎన్ని విధాలుగానైనా అపభ్రంశంగా పలికే అవకాశాన్నిస్తుంది దేవభాష ఎందుకు గొప్పదంటే ఆ భాషలో దేన్ని రాసినా మరో తీరుగా చదివే అవకాశాన్నియ్యదు. ఆ కారణంగా ఈయన ఎవరికి వారికి తమతమ పురాల్లో (శరీరాల్లో) కన్పించ సిద్ధంగా ఉన్న జగన్నాథుడు కాబట్టి 'పురి జగన్నాథుడు' మాత్రమే.

ఆ రథాలు మూడూ మనకుండే స్థూల సూక్ష్మ కారణ శరీరాలకి సంకేతాలు. ఈ ఆలయంలోకి ప్రవేశించాలంటే ఎక్కవలసిన మెట్లు 22 ఉంటాయి. గోవింద గోవింద హరీ! మురారీ!

'హేనాథ! నారాయణ! వాసుదేవ! అనే ఈ నామాన్ని మెట్టుకొక్కొక్క మారు చెప్తున్న అనుకుంటూ ఎక్కాలి. పైశ్లోకంలో ఉన్న ఒక్కో పాదంలోనూ అక్షరాల సంఖ్య 11 మాత్రమే. మొత్తం రెండు పాదాల్లోనూ కలిపి 22. ఈ 22మన్నా పితృదేవతలకి సంకేతం.

తనని కని పెంచి పోషించి ఓ ప్రయోజకుణ్ణో, ప్రయోజకురాలిగా తీర్చిదిద్దిన ఆ పితృదేవతల అనుగ్రహాన్ని పొందనిదే, నా వద్దకి రా(లే)వని దైవం ఎంతో స్పష్టంగా సూచిస్తున్నాడు. గతించిన తల్లిదండ్రుల్ని స్మరించుకోవాలనే బుద్ధిని ఎంత గొప్పగా సూచిస్తున్నాడో కదా దైవం! కొండ అద్దంలో కొంచెంగానే కన్పించేటట్టు అంత జగత్+నాథుణ్ణే గురించి ఎంత ఎంత ఎంతెంత వివరించుకున్నా అదంతా సశేషమే తప్ప ముగింపు ఉండదు-లేదు.

డా॥ మైలవరపు శ్రీనివాసరావు